క్లుప్తంగా

పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కటశివయ్య

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిశుభ్రత వల్ల ప్రబలే వ్యాధులు, శుభ్రతతో ప్రయోజనాలను మున్సిపల్ మేనేజరు వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్ విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. స్క్రీన్‌పై వీడియోలను ప్రదర్శిస్తూ చిత్రాల రూపంలో చూపించారు. పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించగా కమిషనర్ జగ్జీవన్ పర్యవేక్షించారు.

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా ఆనంద్



నారాయణఖేడ్: సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్. ఆనంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో నిర్వహించిన పార్టీ జిల్లా మహాసభలో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. బడుగు, బలహీనవర్గాలు, కార్మికులు, విద్యార్థులు, యువకుల కోసం, పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

గంజాయి సాగు చేస్తే జైలుకే..



గంజాయి సాగుపై తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మహేశ్

కల్హేర్(నారాయణఖేడ్): ఎవరైనా అక్రమంగా గంజాయి సాగు, రవాణా చేస్తే జైలుకు పంపుతామని సిర్గాపూర్ ఎస్‌ఐ మహేశ్ హెచ్చరించారు. గురువారం సిర్గాపూర్ మండలం వంగ్దల్ శివారులో పత్తి చేలో గంజాయి సాగుపై తనిఖీ చేశారు. పత్తి, కంది చేల్లో అంతర్ పంటగా గంజాయి సాగు చేసే వారిపై నిఘా పట్టినట్లు తెలిపారు. గంజాయి సాగు చేసే వ్యక్తుల గురించి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో వందరోజుల ప్రణాళికలో భాగంగా గురువారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పలు కాలనీల్లో మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ, ఏఈ సాయి మౌనిక, మేనేజర్ ఆఖిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌తో నిర్మాణం వేగం

సంగారెడ్డి టౌన్: భారతి సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతోందని బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలో సాయిబాలాజీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో బిల్డర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతి సిమెంట్ పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, డీలర్లు కృష్ణకాంత్ బిల్డర్లు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన రేష్మబేగం అంబులెన్స్‌లో ప్రసవించింది. గురువారం రేష్మబేగంకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన 108 సిబ్బంది ఈ ఎంటీ కిరణ్ కుమార్, పైలెట్ రాజేందర్ ఆమెను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నారు. అప్రమత్తంగా వ్యవహరించిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు దాటాలంటే నరకమే..

వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్ పాటించడం లేదు. రెడ్‌సిగ్నల్ పడినా పట్టించుకోకుండా దూసుకెళ్తున్నారు. ఎలాంటి జరిమానాలు విధించలేరనే భావనతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ప్రయత్నం చేస్తున్నారు.

- జాతీయ రహదారిని దాటేందుకు ఇక్కట్లు
- ట్రాఫిక్ సిగ్నల్‌ను పట్టించుకోని వాహనదారులు



ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న జనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిని దాటాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పడిన పట్టించుకోకుండా వాహనదారులు దూసుకెళ్తున్నారు. దీంతో రోడ్డు దాటాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని భయాందోళన చెందుతున్నారు. పట్టణ పరిధి బీరంగూడ, అశోక్ నగర్, వినాయక నగర్‌కాలనీల వద్ద జాతీయ రహదారిని దాటేందుకు మహిళలు, చిన్నారులు ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనేక ఏళ్ల ఈసమస్య ఉన్నప్పటికీ పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు అశోక్‌నగర్, బీరంగూడ చౌరస్తా వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు. హామీ నేటికి అమలుకు నోచుకోవడం లేదు. రోడ్డు దాటే వారి కోసం అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. రెడ్‌లైట్ పడినప్పటికీ వాహనదారులు ఆగకుండా వేగంగా ముందుకు దూసుకెళ్తున్నారు. దీంతో ప్రజలు జాతీయరహదారిని దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 20 నిమిషాల వరకు ప్రమాదకరంగా రోడ్డు డివైడర్‌పై నిలబడుతున్నారు. దీని కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కనీసం ఉదయం, సాయంత్రం రద్దీ సమయంలో ట్రాఫిక్ సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నూతనంగా



రెడ్ సిగ్నల్ పడినా ముందుకు వెళ్తున్న వాహనాలు

ప్రారంభమైన ఫ్లైఓవర్ కారణంగా వాహనదారులు మీతిమిరిన వేగంగా ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారిని దాటాలంటే ప్రాణాలు ఎక్కడా గాలిలో కలిసి పోతాయేనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారులకు తల్లిపాలతో ఆరోగ్యం

జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న లలితకుమారి

సంగారెడ్డి టౌన్ : చిన్నారులకు తల్లిపాలు ఆరోగ్యవంతమైనవని రోగ నిరోధక శక్తిని పెరిగి ఆరోగ్యంగా ఉంటారని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి అన్నారు. గురువారం మండలంలోని కలబ్‌గూర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు గంటలోపు పాలు తాగించాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రసన్న చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సౌమ్య, సూపర్‌వైజర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోగనిరోధక శక్తిని పెరుగుతోంది..

జహీరాబాద్: శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే వారిలో రోగనిరోధక శక్తిని పెరిగి వ్యాధుల నుంచి రక్షిస్తుందని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త హేమలత పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఐడీఎస్‌ఎంటీ, బసవేశ్వర మహిళా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. శిశువు జీవితంలో మొదటి ఆరు నెలలు అవసరమైన మొత్తం శక్తిని, పోషకాలను తల్లి పాలు అందిస్తాయన్నారు. తల్లిపాలు సురక్షితంగా, శుభ్రంగా ఉండడం వల్ల ఇన్ఫెక్షన్, అతిసారం వంటి సమస్యలు పిల్లల్లో రాకుండా ఉంటాయని తెలిపారు. అంతే కాకుండా పాలు ఇచ్చే తల్లులు బరువు త్వరగా తగ్గుతారని, గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడంలో సహాయపడుతుందన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ రిస్క్ కూడా తక్కువ అవుతుందని తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీతాబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాలిచ్చే తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

స్పాట్ సెలక్షన్ పూర్తి

జోగిపేట(అందోల్): అందోలు-జోగిపేట మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. కళాశాలలో ఖాళీగా ఉన్న 11 సీట్లకు 27 మంది విద్యార్థినులు దరఖాస్తు చేసుకోగా, మెరిట్, కెటగిరీని బట్టి వారికి సీట్లు కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వాణి తెలిపారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, ఈసీఈల్లో మొత్తం ఒక్కొక్క గ్రూపులో 66 మంది విద్యార్థినిలను చేర్చుకున్నామన్నారు.

ఘనంగా శ్రావణమాస అనుష్టాన ప్రవచనం



నరసింహారావు దంపతులను సన్మానిస్తున్న చౌకిమఠం సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో కాశీ జగద్గురువు చంద్రశేఖర శివాచార్య మహాస్వామి శ్రావణమాస ధర్మ ప్రచార అనుష్టాన ప్రవచన కార్యక్రమంలో భాగంగా గురువారం డాక్టర్ గరికపాటి నరసింహారావు ధార్మిక ప్రవచనం చేశారు. శ్రావణమాసంలో జగద్గురువుల సామూహిక ఇష్ట లింగార్చన ప్రవచన కార్యక్రమంలో నరసింహారావు శివ నామ మహాత్యం గురించి ధార్మిక ప్రవచనం చేశారు. ప్రవచనం అనంతరం జగద్గురువు గరికపాటి నరసింహారావు దంపతులకు మంగళ ఆశీస్సులు సమాజం సభ్యులు పూలమాల శాలువాతో సన్మానించి అభినందించారు.

సిమెంటు బస్తాల అందజేత

నారాయణఖేడ్: మండలం పరిధి వెంకటాపూర్ తండాకు చెందిన రావణ్‌కు ఇందిరమ్మ ఇల్లు మొదటి విడతలో మంజూరైంది. నిరుపేద కుటుంబం కావడంతో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించుకోలేని పరిస్థితుల్లో ఉంది. అదే తండాకు చెంది ఆర్‌ఎంసీఎస్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు నిర్వాహకులు రాములు చౌహాన్ అతడి ఇంటి నిర్మాణానికి 20 సిమెంటు బస్తాలు అందజేశారు.

వీధి కుక్కల పట్టివేత

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల పట్టివేత చర్యలు కొనసాగుతున్నాయి. పలు కాలనీల్లో వీధి కుక్కలు పెద్ద సంఖ్యలో గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో శునకాలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. వలల ద్వారా కుక్కలు పట్టే కార్మికులను పిలిచి వాటిని పట్టుకుని వ్యానులో తరలించారు. కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలనిచ్చారు.

భూసమస్యలు తలెత్తకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పాండు

ఆర్డీఓ పాండు

వట్‌పల్లి(అందోల్): రెవెన్యూ రికార్డులు, రీసర్వే చేసిన వివరాలతో సరిపోల్చి భవిష్యత్‌లో భూసమస్యలు తలెత్తకుండా రికార్డుల నిర్వహణను చేపడుతున్నట్లు అందోల్ ఆర్డీఓ పాండు అన్నారు. గురువారం వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే వివరాల రికార్డుల నమోదుపై అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం భూముల రీసర్వేను చేపడుతుందన్నారు. రీసర్వేకు సంబంధించిన రికార్డుల ఆధారంగా పహాణీలు, మోకాపై ఉన్న రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ల్యాండ్ ఆక్యూపేషన్ ప్రక్రియ భూముల రీమార్కుల వంటి అంశాలను పరిశీలించి రీసర్వేకు సంబంధించి అన్ని రికార్డులు జియో ట్యాగింగ్ చేసి భూహక్కుల వివరాలు డిజిటల్ రూపంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో భూముల విషయంలో ఉన్న సందిగ్ధతకు ఈ సర్వే రికార్డులు తుది నివేదికల నిలిచేలా రికార్డులను తయారు చేసి ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ శ్రీనివాస్ , ఆర్ఐ రాహుల్, సర్వేయర్ మురళీధర్, సీనియర్ అసిస్టెంట్ చేతక్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

పాల్గొన్న రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

జోగిపేట(అందోల్): అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని గూడెం కాలనీలో గురువారం తెలంగాణ రైతువిజ్ఞాన కేంద్రం-శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, డా.అరుణ ఆధ్వర్యంలో గ్రామీణకృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమం (పీఆర్‌ఏ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఏడబ్ల్యూఈపీ విద్యార్థులు అందోలులో ఉన్న ప్రస్తుత పరిస్థితులు సమస్యలు మ్యాప్ ఆధారంగా రైతులకు వివరించారు. గ్రామంలో ఏ పంట ఎంత విస్తీర్ణంలో వేశారు? అలాగే రైతులకు ఉన్న వనరులు, మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో టీఆర్‌వీకే- సంగుపేట్ శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ...ఈ కార్యక్రమం వల్ల గ్రామంలో ఉన్న ఆర్థిక సామాజిక, ప్రస్తుత పరిస్థితులపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ విస్తరణ అంశాలను వివరించారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ శ్రీకాంత్, ఆకాష్, వ్యవసాయ విద్యార్థులు ఎ.సృజన్, నవజీవన్, చందు,వరుణ్,బి.దినేశ్ గ్రామ రైతులు బట్ట నర్సింహులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన నియామకం

నారాయణఖేడ్: నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ కంగ్టి మండల శాఖ అధ్యక్షుడుగా పవార్ శ్రీనివాస్ నియామకమయ్యారు. గురువారం నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం ఆదేశాల మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ, జిల్లా చైర్మన్లు రాజ్ కుమార్, అఖిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మైనోద్దీన్ ఖురేషి ఆయనను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంగ్టి మండలంతో పాటు గ్రామాల్లో మానవ హక్కుల పరిరక్షణ, విద్య, వైద్యం, బాలల హక్కుల పరిరక్షణ, ఆరోగ్యం, న్యాయం, రెవెన్యూ, రైతు, మహిళల సమస్యలపై స్పందించి.. పరిష్కరించాలని సూచించారు.

◆ సభ్యత్వ నమోదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఎస్టీయూ ముందుందని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ అన్నారు. గురువారం రామచంద్రాపురం జిల్లాపరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడంలో తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు.

◆ ఎకరాకు బస్తా యూరియా

మునిపల్లి(అందోల్): ఎకరాకు ఒక బస్తా యూరియా ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి అంజలి తెలిపారు. మండలంలోని తాటిపల్లి ఆగ్రోస్ సేవా కేంద్రంలో ఆధార్ కార్డు, వ్యవసాయ భూములకు సంబంధించి పట్టాపాస్ బుక్ ఆధారంగా యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఎక్కువ యూరియా కావాలని రైతులు డిమాండ్ చేస్తే యూరియా సరిపోవాలని నిబంధనల ప్రకారం యూరియా బస్తాను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

◆ మర్వెల్లికి గ్రంథాలయం మంజూరు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధి మర్వెల్లి గ్రామానికి గ్రంథాలయం మంజూరైనట్లు పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సంగమేశ్వర్ తెలిపారు. గ్రంథాలయం ఏర్పాటుకు సంబంధించి జిల్లా గ్రంథాలయ సమత సెక్రటరీ వసుంధర ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలియజేశారు. గ్రామాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థుల ప్రయోజనార్థం వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేందుకు గ్రంథాలయం ఉపయోపడుతుందన్నారు. గ్రాంథాలయం ఏర్పాటు చేయడంపై మంత్రి దామోదరకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

మునిపల్లి(అందోల్): అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని సంగారెడ్డి ఎల్‌డీఎం నర్సింగ్‌రావు అన్నారు. గురువారం మండలంలోని తాటిపల్లిలో బుదేరా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ జి.వంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన జనసురక్ష సంతృప్తి శిబిరం నిర్వహించారు. డిజిటల్ భద్రత, సురక్షిత లావాదేవీలపై వివరించారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, ప్రధానమంత్రి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన బీమాలపై వివరించారు.

రాజగోపురంతో మరింత వైభవం

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): వీరభద్రస్వామి ఆలయ ముఖద్వారం రాజగోపురం నిర్మాణంతో ఆలయ వైభవం మరింత పెరగనుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడిదల పట్టణ పరిధి వీరన్నగూడెంలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న బొంతపల్లి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో రూ.8.40 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న 140 అడుగుల పొడవుతో, తొమ్మిది అంతస్తుల రాజగోపురం నిర్మాణ పనులకు ఆలయ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ధర్మకర్తలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో లేని అరుదైన రాజగోపురం నిర్మాణం వీరభద్రుడి కల్పించిన సంకల్పమని కొనియాడారు. నూతన కమిటీ హయాంలో రాజగోపురం నిర్మించడం అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, భద్రప్ప, శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ కిషన్, భక్తులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం పెరుగుదల



పంటను పరిశీలిస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఏఈఓ ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని రంజోల్ గ్రామంలో రైతు పొలంలో జనుము, పెసర, అలసంద, కుసుమ, నువ్వులు, గడ్డి నువ్వులు జొన్న, మొక్కజొన్న, అనుములు కలిసి సాగు చేసిన నవధాన్యాల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ.. నవధాన్యాలు భూసారపెంపులో ప్రధాన ప్రాత వహిస్తున్నాయని తెలిపారు. పంటను కలియదున్నడం వల్ల భూసారం పెంచుకోవచ్చని చెప్పారు. చాలా వరకు ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు.

చారిత్రాత్మక వేతన ఒప్పందాలు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మికుల పక్షాన ఉండి సమస్యలపై గళమెత్తేది సీఐటీయూ అని.. కిర్బీ పరిశ్రమలో మరోసారి గెలిపించాలని యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని కిర్బీ పరిశ్రమ వద్ద జరిగిన కార్మిక సంఘం ఎన్నికల గేట్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా చుక్కా రాములు హాజరై మాట్లాడారు. ఆగస్టు 8న జరిగే కిర్బీ పరిశ్రమలో సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్టీయూతో కార్మికులకు ఒరిగింది ఏమీ లేదని కార్మికులకు చేసిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. సీఐటీయూకు మాత్రమే చారిత్రాత్మకమైన అనేక వేతన ఒప్పందాలు చేసిన చరిత్ర, అలవెన్స్‌లు సాధించిన చరిత్ర సీఐటీయూకే ఉందన్నారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రాజయ్య, జనరల్ సెక్రటరీ రాజు, మల్లేశ్, మాణిక్యం, పాండు రంగారెడ్డి, రాములు, మధు, వెంకట్, మల్లేష్ ,రాజేష్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

రోడ్లపై మొక్కల నాటి నిరసన



మొక్కలు నాటుతున్న సీపీఎం నాయకులు

జహీరాబాద్ టౌన్: ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు గురువారం నిరసన తెలిపారు. సీపీఎం నాయకుడు మహిపాల్ ఆధ్వర్యంలో నాయకులు బైపాస్ రోడ్డు నుంచి అల్గోల్‌కు వెళ్లే బురద రోడ్డులో మొక్కలను నాటి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే అల్గోల్ రోడ్డు చినుకుపడుతే బురదమయంగా తయారై ప్రజలు నరకం చూస్తున్నారని వాపోయారు. వాహనచోదకులు నిత్యం అవస్థలు పడుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డుపై పడిన గుంతలను పూడ్చి పూర్తిస్థాయిలో బాగు చేయాలని కోరారు. మండలంలోని బుర్దిపాడ్ రోడ్డులో కూడా సీపీఎం నాయకులు మొక్కలు నాటి నిరసన వ్యక్తం చేశారు. రహదారి నుంచి బుర్దిపాడ్ వరకు గల రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా తయారైందని, మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల అవస్థలు పడుతున్నామని సీపీఎం నాయకులు వాపోయారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేత దినోత్సవంలో కార్మికులు, పద్మశాలీ సోదరులు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలో అధ్యక్షుడు చింతా ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ఆనంద్ మాట్లాడుతూ.. చేనేత రంగ అభివృద్ధి కోసం స్వాతంత్ర సమరయోధులు,ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను గుర్తు చేశారు. చేనేత కార్మికులను అదుకోవడానికి ప్రభుత్వాలు చొరవ తీసుకోవడంతో పాటు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు సన్మానించారు. కార్యక్రమంలో మార్కండేయ మందిరం చైర్మన్ రవికుమార్, సంఘం ఉపాధ్యక్షుడు గణేశం, మేనేజర్ వెంకటేశం, సభ్యులు గోనే శంకర్, రమేష్, ప్రభు, మనోహర్, జగదీశ్, ఆంజనేయులు చేనేత కార్మికులు పద్మశాలి సోదరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

ఝరాసంగం(జహీరాబాద్): తెలంగాణ మోడల్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాఖి పండుగను పురస్కరించుకుని ఝరాసంగం మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థిని విద్యార్థులకు రాఖీలు కట్టారు. అలాగే పాఠశాల ఆవరణలోని వృక్షాలకు రాఖీలు కట్టారు.

రాఖీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి టౌన్ : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని రీజినల్ మేనేజర్ విజయ భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 180 బస్సులను నాలుగు రోజుల పాటు అదనంగా నడిపిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో..

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు రక్ష బంధన్ నిర్వహించారు. మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగారం శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మణ్, టీచర్లు నిహారిక, నిర్మల, మహేందర్, మధుకర్‌రెడ్డి, లక్ష్మి, శ్రీరామ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వినతి

నారాయణఖేడ్: పట్టణంలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ గురువారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్, న్యాయవాది అలిగే జీవన్ గురువారం సంఘం నాయకులతో కలిసి స్థానిక సబ్ కలెక్టరు ఉమాహారతికి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని రాజీవ్ చౌక్, అంబేడ్కర్ చౌక్, బసవేశ్వరచౌక్, శివాజీ చౌక్‌ల వద్ద రోడ్లు గోతులమయంగా మారడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. మరమ్మతులు చేయని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. సంఘం నాయకులు లాల్‌కుమార్, అంజి, గంగారాం, రాజు, సాయిలు, డేవిడ్, యాదయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.